క్లుప్తంగా

పండగ సంత కిటకిట



సంతలో వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు

కొయ్యూరు: పండగ సంత హోరెత్తింది. కొయ్యూరులో ఆదివారం జరిగిన సంతకు రెట్టింపు సంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చారు. దుస్తుల షాపులు, గిల్ట్ నగల షాపులు కిటకిటలాడాయి. మామూలు రోజుల్లో జరిగే సంతకు 4వేల నుంచి 5 వేల మంది వరకు వస్తారు. అయితే భోగి రోజు జరిగిన సంత కావడంతో రెట్టింపు సంఖ్యలో వచ్చారు. ఇక మారుమూల ప్రాంతాలకు సైతం రోడ్లు కావడంతో నడక బాధ చాలా వరకు తగ్గింది. ఆటోల ద్వారా లేదా ద్విచక్ర వాహనాల ద్వారా వస్తున్నారు. ఇలా రావడంతో కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ కూడా అయింది. సంతలో పదికి పైగా దుస్తుల షాపులు వెలిశాయి. దుకాణాలన్నీ జనంతో నిండిపోయాయి. సంక్రాంతికి అవసరమైన వస్తువులను కొనుగోలు స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి జనం వచ్చారు.

మర్రిగూడెంలో స్వచ్ఛభారత్

కూనవరం: చూచిరేవులగూడెం పంచాయతీ మర్రిగూడెంలోని ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ సంకల్ప కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పరిసర ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తను, ముళ్లపొదలను తొలగించారు. అనంతరం అమ్మవారి ధ్వజస్తంభం ముందు అయోధ్య రామయ్య అక్షింతలు ఉంచి పూజలు చేశారు. రామారావు, సత్యనారాయణమ్మ, వెంకయ్య, సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాముని అక్షింతలు



అయోధ్య అక్షింతలతో నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

రాజవొమ్మంగి: అయోధ్య నుంచి వచ్చిన పవిత్ర అక్షింతల పంపిణీ ఇంటింటికి మండలంలోని జడ్డంగిలో ఆదివారం జరిగింది. తొలుత సర్పంచ్ కొంగర మురళీ కృష్ణ, గురు భవాని తోట సూరిబాబుల ఆధ్వర్యంలో భక్తులు నగర సంకీర్తన చేశారు. ఈ నెల 22వ తేదీన అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ట నేపథ్యంలో ఆలయాల్లో, ఇళ్లల్లో చేపట్టాల్సిన ఆధ్యాత్మిక కార్యక్రమాలను వివరించారు. రవి, శ్రీనివాస్, గంగాధర్, నాగేశ్వరరావు, వెంకటరమణ, పెద కాపు, పూర్ణ, గణేశ్, బాబి మహిళలు పాల్గొన్నారు.

సందడిగా ఎడ్లబళ్ల పోటీలు



ఉమ్మలాడలో పరుగులు తీస్తున్న ఎడ్లబండి

మునగపాక: భోగిపండగ సందర్భంగా ఉమ్మలాడలో మాజీ సర్పంచ్ కర్రి భాస్కరరావు ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఎడ్లబళ్ల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గాలిపటాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

రేపు జిల్లా స్థాయి గుర్రాల పరుగు పోటీలు

మునగపాక : సంతబయిల అభయాంజనేయ స్వామి వారి వార్షికోత్సవాలను ఈ నెల 16న ఘనంగా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా బైపాస్ రోడ్డు దరి జిల్లా స్థాయి గుర్రాల పరుగు పోటీలను నిర్వహిస్తున్నారు. పోటీల కరపత్రాలను డాన్‌జిమ్ అధినేత పెంటకోట అజయ్ ప్రారంభించారు. మణికంఠ, మోహన్, గోవింద్ పాల్గొన్నారు.

పతంగుల సందడి

అనకాపల్లి: వాసవీక్లబ్ ఆధ్వర్యంలో భోగిపండగను పురస్కరించుకొని పట్టణంలో పతంగుల వేడుకలు జరిగాయి. పెద్దసంఖ్యలో చిన్నారులు హాజరై గాలిపటాలు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఫౌండర్ ఎ.కాసన్న, అధ్యక్షుడు కె.సాయికిశోర్, కార్యదర్శి డి.రత్నాజీరావు, కోశాధికారి జి.శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో భోగి

సాక్షి,పాడేరు: మన్యంలో సంక్రాంతి సంబరాలు భోగిపండగతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం వేకువజాము నుంచే భక్తిశ్రద్ధలతో భోగిమంటలు వేసి సందడి చేశారు. తెల్లవారుజామున కుటుంబ సమేతంగా తలంటి స్నానాలు అచరించి కొత్త దుస్తులు ధరించి భోగి మంటల వద్ద చేరుకున్నారు. గిరిజన గ్రామాల్లో, గ్రామచావిడి వద్ద భోగి మంటలు వేయగా,సోమవారం ఉదయం నుంచి సంక్రాంతి సంబరాలకు గిరిజనులంతా తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

అరకులోయటౌన్: తెలుగు ఇంట సంక్రాంతి సంబరాల్లో ఒకటైన భోగి పండుగ వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామ గ్రామాన, వీధుల్లో ప్రజలు ప్రధాన కూడళ్ల వద్ద భోగి మంటలు వేశారు. అరకులోయ పట్టణంలో పలు వీధుల్లో భోగి మంటలు వేశారు. ఇంటి ముందు రంగవల్లులు వేసుకున్నారు. సోమవారం సంక్రాంతి పండుగ వేడుకను రంగరంగ వైభవంగా జరుపుకోవడానికి ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు.

అనంతగిరి: గిరిజన గ్రామాల్లో ఉత్సహంగా భోగి పండగ వేడుకలను నిర్వహించారు.. గ్రామాల్లో గిరిజనులంతా ఒకచోట చేరి, భోగి మంటలు వేసి, భక్తిని చాటారు. మండల కేంద్రంలోగల పెద్దూరు గ్రామంలోని యువతీ, యువకులు థింసా నృత్యాలను ఆలరించారు. తాటిగూడ జలపాతాన్ని చూసేందుకు వెళుతున్న పర్యాటకులు సైతం గిరిజనులతో కలిసి థింసా నృత్యాలను వేసి, సందడి చేశారు. పర్యాటకులు రాకతో ప్రాంతమంతా కళకళలాడింది.

హుకుంపేట: సంక్రాంతి పండగా నేపథ్యంలో మండల కేంద్రంతో పాటు మండలంలోని మారుమూల గ్రామల సైతం భోగి పండగా ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో భోగి మంటలు కాలుస్తు నృత్యాలతో గిరిజనులు సందడి చేశారు. మండలంలోని కొంతిలి గ్రామంలో సర్పంచ్ రేగం రమేష్ ఆధ్వర్యంలో భోగి పండగా ఘనంగా నిర్వహించారు.

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో యువత భోగి మంటలు వేశారు. యువకులు, చిన్నారులు భోగి మంట వద్ద థింసా నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

చింతపల్లిరూరల్: మండలంలో భోగి సంబరాలు ఘనంగా జరిగాయి.ముందుగా గిరిజనులు ఉదయం భోగి మంట వేసుకోన్నారు.కోత్త బట్టలు ధరించి ఒకరికి ఒకరు భోగి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

జి.మాడుగుల: మండలంలో పలు గ్రామాల్లో భోగి పండగను ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు, యువకులు భోగి మంటల వద్ద సందడి చేశారు. అనాధిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం పిల్లలకు భోగి పండ్లు పోయడం నిర్వహించారు.

రాజవొమ్మంగి: మండలంలోని గదబలు నివశించే ఆదివాసీ తండా అప్పలరాజుపేటలో ఆదివారం సంక్రాంతి సంబరాలు సందడిగా సాగాయి. ఆటలు డీజే. పాటలతో రోజంతా సాగింది. కమ్యూనిటి హాలు ఎదుట ముగ్గుల పోటీ నిర్వహించారు. గ్రామదేవతలు అయిన మరడమ్మ, పేరంటాలమ్మ ఆలయాల వద్ద పూజలు చేశారు. రకరకాల పిండి వంటలు చేసి నివేదించారు. కేదారి చంద్రరావు, రాధ, హనుమంతు నూకరాజు, లక్ష్మి తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



హుకుంపేట కొంతిలిలో భోగి మంట వద్ద స్థానికులు



పాడేరులో భోగిమంట వద్ద కుటుంబసభ్యులు



జి.మాడుగులలోని భోగి వేడుకలో పెద్దలు, చిన్నారులు



అరకులోయలో భోగి మంట



అప్పలరాజుపేటలో ముగ్గుల పోటీలు



అనంతగిరి పెద్దూరు గ్రామంలోని థింసా నృత్యాలు



చింతపల్లిలో భోగి మంట

సంప్రదాయాల పరిరక్షణ అందరి బాధ్యత

దేవీపట్నం: ప్రతి పౌరుడు సంక్రాంతి పండుగ విశిష్టతను తెలుసుకొని, మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని ఎంపీపీ కుంజం మురళి ఆన్నారు. ఇందుకూరుపేట గ్రామంలో ఆదివారం రామాలయం సెంటర్లో అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సంస్కృతి సంప్రదాయాల గురించి పిల్లలకు తెలియజేశారు. 19 సంవత్సరాలుగా సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్న అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు గారపాటి సతీష్ నాయుడు, వరలక్ష్మి దంపతులను ఆయన కొనియాడారు. సమాజ సేవకుడు గురూజీ భగవాన్ శర్మ గారిని సత్కరించారు. భగవాన్ శర్మ చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా ముగ్గులు పోటీ, నృత్య పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి ఆయన బహుమతులను అందచేశారు. వైస్ ఎంపీపీ గారపాటి మురళీ కృష్ణ, నాని మాస్టారు, పిడుగు త్రిమూర్తులు, గారపాటి బాబూరావు, బేబీ అక్క తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ మురళి

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

కె.కోటపాడు: ఎ.కోడూరులోని యాతపేటలో పేకాడుతున్న ఐదుగురిని ఎ.కోడూరు ఎస్ఐ జె.రమేష్ పట్టుకున్నారు. పేకాడుతున్నారన్న సమాచారం మేరకు శనివారం రాత్రి తన సిబ్బందితో దాడి చేశారు. వీరి నుంచి రూ.2,100 స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనృసింహస్వామి తిరువీధి సేవ



రథంపై లక్ష్మీనృసింహస్వామి తిరువీధి ఊరేగింపు

కశింకోట : కశింకోటలోని లక్ష్మీనృసింహస్వామి తిరు వీధి ఊరేగింపు ఆదివారం ఘనంగా జరిగింది. భోగి పండగ పురస్కరించుకొని స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగించారు.అర్చకుడు అత్తిలి కోదండపాణి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా సోమవారం కూడా స్వామి వారి తిరువీధి సేవ జరగనుంది.

ఘనంగా ముగిసిన మేలుకొలుపు

మాకవరపాలెం: మండలంలో భోగి పండగను ప్రజలంతా ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జామునే పెద్దలు, పిల్లలు స్నానాలు ఆచరించి భోగిమంటలు కాగారు. ధనుర్మాసం సందర్భంగా నెలరోజులుగా నిర్వహిస్తున్న మేలుకొలుపు కార్యక్రమాన్ని లచ్చన్నపాలెం ఆదివారంతో ముగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా తెల్లవారుజాము నుంచి హరిదాసు కీర్తనలు, డూడూ బసవన్నలతో భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం ఇక్కడి ఆంజనేయస్వామి ఆలయం వద్ద భోగి మంటలు వేసి సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు.

14సివిఎం43: రోలుగుంటలో..

రోలుగుంట: సిద్ధి వినాయక, జీవకారుణ్య సంఘ భక్త బృందాలు సంయుక్తంగా ధనుర్మాసోత్సవాల సందర్భంగా చేపట్టిన మేలుకొల్పుల కార్యక్రమం ఆదివారంతో ఘనంగా ముగిసింది. ఇందులో భాగంగా భక్తబృందాలు గోదాదేవి, రంగనాథుల చిత్రపటాలను రథంపై పలు గ్రామాల్లో ఊరేగించారు. భక్తుల నుంచి ధన, ధాన్య రూపంలో సేకరించిన కానుకలతో భారీ అన్నసమరాధన నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.



లచ్చన్నపాలెంలో మేలుకొలుపులో పాల్గొన్న స్థానికులు

ముగిసిన ధనుర్మాస ఉత్సవాలు

రాంబిల్లి : గ్రామాల్లో ధనుర్మాస ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని దిమిలి వల్లభనారాయణస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. అర్చకులు నేతేటి రామచంద్రాచార్యులు, గోపాలకృష్ణ పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

గ్రామాల్లో పండగ సందడి



వై.రామవరంలో డూడూ బసవన్నలు



వై.రామవరంలో సంభావన తీసుకుంటున్న హరిదాసు



రాజవొమ్మంగిలో ఇంటి ముంగిటకు వచ్చిన హరిదాసుకు బియ్యం దానంగా ఇస్తున్న చిన్నారులు

వై.రామవరం: గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు హోరెత్తున జరుగుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన వారితో పల్లె తల్లి మురిసిపోతోంది. ఇళ్లకు రంగులు వేసి, మామిడి తోరణాలు కట్టి, ఇంటి ముంగిట రంగవల్లులు అద్ది ఇంటిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో గ్రామాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఇంటింటా సంక్రాంతి వెలుగులు విరజిల్లుతున్నాయి. ఇంటి ముంగిట అలంకరించిన గొబ్బెళ్లతో అందమైన ముగ్గులతో దర్శనమిస్తున్నాయి. వీధులన్నీ జనంతో నిండిపోయాయి. బంధు, మిత్రులతో ఇళ్లు కళకళలాడుతున్నాయి. ప్రతి ఇంట పిండి వంటలు ఘుమఘుమలాడుతున్నాయి.

గ్రామాల్లో డూడూ బసవన్న, హరిదాసులు

సంక్రాంతి పండగను పురస్కరించుకొని మండలానికి కాటికాపర్లు, డూడూ బసవన్న, హరిదాసులు భోగి పండుగ రోజు ఆదివారం ఒక్కసారిగా రాకతో సంక్రాంతి శోభ ప్రారంభమ య్యింది. దీంట్లో బాగంగా భోగి పండుగ రోజు వై.రామవరంలో గంగిరె ద్దులు, కాటికాపరి, హరిదాసుల సందడితో సంక్రాంతి శోభ కానవచ్చింది. ఈఏడాది మాత్రం మైదాన ప్రాంతం నుంచి గంగిరెద్దులు, కాటికాపర్లు, హరిదాసులు ఏజన్సీ ప్రాంతానికి సంక్రాంతికి ముందుగానే చేరుకున్నారు. వీరితో వై.రామవరం మండలంలో సంక్రాంతి శోభ సంతరించుకుంది. ఈ కాటికాపరి వంశానికి చెందిన వ్యక్తులు ఏజెన్సీలో ఒక్కొక్కరు కొన్ని గ్రామాలు పంచుకుని సంక్రాంతి పండుగ నుంచి శివరాత్రి వరకు గ్రామాల్లో ఇంటింటా తిరిగుతు చనిపోయిన వ్యక్తుల ఇళ్లల్లో సంభావన తీసుకుంటారు. దీంట్లో భాగంగా వై.రామవరం మండలానికి ప్రతీ ఏట కాటికాపరి వంశానికి చెందిన పేర్ల మరిడియ్య, అతని కుమారుడు దుర్గప్రసాద్‌లు వచ్చి, ప్రతీ గ్రామంలోను ఇంటింటికి తిరుగుతారు. ఈ సందర్భంగా కాటికాపరి మరిడియ్య తమ వంశస్తులు శతాబ్దాలుగా కాటికాపరి వంశానికి చెందిన వారమన్నారు. తమ పూర్వీకులు నుంచి తమ వృత్తి ధర్మం ప్రకారం కాటి సుంకం వసూలు చేయడం ఆనవాయతీ అన్నారు. ఇందులో భాగంగానే తాము ఏటా గ్రామాల్లో తిరిగి ఆ ఏడాదిలో ఎవరైనా చనిపోయి ఉంటే ఆ ఇంటి నుంచి కాటి సుంకం వసూలు చేస్తామన్నారు. మిగతా గృహాల్లో రకరకాల ఇంద్రజాల విద్యలు ప్రదర్శించి, అందరికి కనువిందు చేస్తు, వారి నుంచి సంభావన తీసుకుంటామన్నారు. ఇది అనాధిగా వస్తున్న తమ కులవృత్తి ధర్మమని మరిడియ్య అన్నారు. గంగిరెద్దు, హరిదాసులను భగవత్ స్వరూపాలుగా భావిస్తారు. దీంట్లో భాగంగా వై.రామవరం బోగి పండుగ అదివారం గంగిరెద్ల సందడి నెలకొంది. వీరందరు గ్రామస్తులకు అనేక రకాలుగా కనువిందు చేస్తు, సంభావనలు తీసుకున్నారు.

రాజవొమ్మంగి: ఏడాదిలో ఎన్ని పండుగలు పబ్బాలు వచ్చినా సంక్రాంతి వేడుక తీరే వేరు. మండలంలో గ్రామ గ్రామానా ఆదివారం నుంచి భోగి, సంక్రాంతి పండుగ కళ ఉట్టిపడింది. ఇంటి ముంగిట భోగి మంటలు వేసి సరదా సరదాగా గడిపారు. ఇంటికి వచ్చిన హరిదాసులకు, గంగిరెద్దులు, జంగమ దేవరలకు తమ శక్తి కొలదీ దానధర్మాలు చేశారు. రంగవల్లులతో వీధులన్నీ కళకళలాడుతు కనిపించాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఇప్పటికే ఇంటికి చేరడంతో రైతుల్లో ఆనందం కనుపించింది. తిండి గింజలకు కొంత ఉంచుకొని మిగిలిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకొన్నారు. విక్రయించుకొన్న ధాన్యానికి చెందిన సొమ్ములు కూడా సకాలంలో రైతుల చేతికి రావడంతో పండుగ ఖర్చులకు వెనుకాడనవసం లేకుండా పోయింది. ఇదిలా ఉండగా ఉద్యోగం, వ్యాపారాల నేపథ్యంలో వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న వారంతా స్వగ్రామాలకు చేరడంతో ఇళ్లల్లో సందడి నెలకొంది.

నంది విగ్రహం ఏర్పాటు

నాతవరం: భోగి సందర్భంగా నంది విగ్రహాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం ఎదురుగా స్థలంలో గ్రామస్తుల సహకారంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం ఆయన గ్రామపెద్దలతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రైతన్నలకు చిహ్నంగా భావించే నంది విగ్రహాన్ని తమ గ్రామంలో ఏర్పాటు చేయాలని 20 ఏళ్ల క్రితం నిర్ణయించామన్నారు. ఈనాటికి కార్యరూపం దాల్చడం ఆనందంగా ఉందన్నారు. తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ కొండబాబు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు లచ్చుబాబు, శ్రీనివాసరావు, నల్లకొండమ్మ ఆలయ కమిటీ సభ్యుడు పోలిరెడ్డి రాజు పాల్గొన్నారు.

కమనీయం.. గోదాదేవి కల్యాణం



వడ్డాదిలో గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణం



మాడుగుల పార్థసారథి ఆలయంలో గోదాదేవి కల్యాణం



కైలాసపట్నంలో గోదాదేవి కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు

బుచ్చెయ్యపేట: ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి రంనాథస్వామివారికి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గత నెల 16వ తేదీ నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భోగి పండగ సందర్భంగా వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణాన్ని ఆలయ పంతులు అంగర శ్రీకాంతచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించగా, పలువురు భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మాడుగుల: రాష్ట్రంలోనే రెండో దేవాలయంగా గుర్తింపు పొందిన అతి పురాతనమైన పార్థసారథి ఆలయంలో ఆదివారం ఉదయం అత్యంత వైభవంగా గోదాదేవి కల్యాణం జరిగింది. ఈ సందర్భంగా రకరకాల పుష్పాలతోపాటు నగలతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారిని ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. కె.జె.పురం కళావేదిక మీద ఆదివారం రాత్రి గోదా రంగనాథుల కల్యాణం వైభవంగా జరిగింది.

కోటవురట్ల: కైలాసపట్నంలో రాజగోపాలస్వామి వారి ఆలయంలో గోదాదేవి కళ్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యురాలు మణికుమారి ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవం కమనీయంగా నిర్వహించారు.